క్లుప్తంగా

జీవాలకు టీకాలు



యు.కొత్తపల్లెలో గొర్రెకు టీకా వేస్తున్న దృశ్యం

డోన్ : గొర్రెలు, మేకల్లో నీలి నాలుక వ్యాధి నివారణకు ఈ నెల 30వ తేదీ వరకు గ్రామాల్లో ఉచితంగా టీకాలు వేస్తామని పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ నాగరాజు తెలిపారు. మండలంలోని యు.కొత్తపల్లె గ్రామంలో పశువైద్య అధికారి పద్మావతి ఆధ్వర్యంలో ఉచితంగా టీకాలు వేసే కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, ఏడాది వయస్సు ఉన్న గొర్రె, మేక పిల్లలు ఈ వ్యాధి బారిన పడే అవకాశం ఉందన్నారు. జ్వరం రావడం, ముక్కు కారడం, సొంగ కారడం వ్యాధి లక్షణాలన్నారు. అసిస్టెంట్ మహమ్మద్ రఫీ, సిబ్బంది నవ్య, కల్యాణి పాల్గొన్నారు.

సెరికల్చర్ సైంటిస్ట్‌గా దుర్గం సురేఖ



డోన్ టౌన్ : గత ఏడాది ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐకార్) ఎంట్రెన్స్‌లో ఈడబ్ల్యూఎస్ కోటాలో ఆలిండియా మొదటి ర్యాంకు సాధించిన దుర్గం సురేఖ ప్రభుత్వ సెరికల్చర్ విభాగంలో సైంటిస్ట్‌గా ఎంపిక య్యారు. మండలంలోని జగదుర్తి గ్రామానికి చెందిన దివంగత లక్ష్మికాంతరెడ్డి, అరుణ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె అయిన సురేఖ మహానంది వ్యవసాయ కళాశాలలో అగ్రికల్చర్ బి.ఎస్సీ, బెంగళూరు జీకేవీకే కళాశాలలో ఎంఎస్సీ సెరికల్చర్ పూర్తి చేసింది. అనంతరం ఐకార్ ఎంట్రెన్స్‌లో అత్యుత్తమ ర్యాంక్ సాధించింది. మంగళవారం జరిగిన ఇంటర్వ్యూలో ఎంపిక కావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

బదిలీ ఉద్యోగికి సన్మానం



కృష్ణనాయక్‌ను సత్కరిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : విద్యుత్‌శాఖలో ఈఆర్‌ఓ కార్యాలయంలో జేఏఓగా విధులు నిర్వహిస్తున్న కృష్ణ నాయక్ బదిలీపై కర్నూలుకు వెళ్తున్న సందర్భంగా బుధవారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఏఏఓ చంద్రశేఖర్,సిబ్బంది సరళ,ఇదురుబాషా,రాజశేఖర్,వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అమావాస్య పూజలు



గాడుబావి వీరాంజనేయస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

బేతంచెర్ల: స్థానిక బైటిపేటలో వెలసిన గాడుబావి వీరాంజనేయస్వామి, గౌరి పేటలో వెలసిన ఆంజనేయ స్వామి, పలక చింతమాను, కనుమ ఆంజనేయస్వామి ఆలయంలో జ్యేష్ఠ మాస అమావాస్య సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకం, సింధూర అర్చన, ఆకుపూజ, మహామంగళ హారతి జరిపించారు. బనగానపల్లె రహదారిలోని పుట్ట పెద్దమ్మ ఆలయంలో నిర్వాహకులు రామకృష్ణ ఆధ్వర్యంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. సిమెంట్ నగర్ గ్రామంలో సుంకులా పరమేశ్వరి ఆలయంలో జరిగిన పూజల్లో భక్తులు పాల్గొన్నారు.

డ్రైనేజీలు ఏర్పాటు చేయాలి

డోన్ టౌన్ : శ్రీనివాసనగర్ కాలనీలో మురుగు కాలువలు ఏర్పాటు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్,జిల్లా నాయకులు చిన్న రహిమాన్,ఐద్వా నాయకురాలు షమీమ్ బేగం కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం కమిషనర్ ప్రసాద్‌గౌడ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కాలనీ ఏర్పాటు చేసి 20 సంవత్సరాలు గడిచినా మురుగు కాలువలు, సీసీ రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవ్వడంతో పాటు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షా కాలం కావడంతో వర్షపునీరు బయటకు వెళ్లే మార్గం లేక ఇళ్లల్లోకి వస్తున్నాయని, అలాగే..కాలనీలో మట్టిరోడ్లు బురదమయమై..నడవడానికి వీలుకానట్లుగా మారుతున్నాయన్నారు. అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని కోరారు.

శ్మశానానికి స్థలం కేటాయించాలి

డోన్ టౌన్ : క్రైస్తవ సమాధుల తోట నిండిపోవడంతో ప్రస్తుతం అంత్యక్రియలు జరుపుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, క్రైస్తవ సమాధుల తోట కోసం మరో ఐదెకరాల స్థలం కేటాయించాలని డోన్ సమైఖ్య క్రైస్తవ సంఘం అధ్యక్షుడు జాకబ్‌పాల్, కార్యదర్శి రాజశేఖర్, కోశాధికారి బాబన్న,ఉపాధ్యక్షుడు హనోక్,సహాయకార్యదర్శి శ్యామూల్ కోరారు. బుధవారం ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అలాగే గుత్తి రోడ్డులో ఉన్న సమాధుల తోట వర్షాల కారణంగా ప్రహరీ కూలి పోయిందని పునర్నిర్మాంచాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ..పరిశీలిస్తామని హామీనిచ్చారు.

ఇన్‌చార్జ్‌ల పాలన.. అస్తవ్యస్తం

- పలు శాఖల్లో ఇన్‌చార్జ్ అధికారులే దిక్కు
- కుంటుపడిన పాలన
- సేవలందక ప్రజల ఇక్కట్లు



రెగ్యులర్ డిపో మేనేజర్ లేని కోవెలకుంట్ల ఆర్టీసీ డిపో



రెగ్యులర్ ఈఓ లేని కోవెలకుంట్ల పంచాయతీ కార్యాలయం

కోవెలకుంట్ల: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ స్థాయిలో పరిపాలనను వికేంద్రీకరణ చేస్తూ గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి వీటి ద్వారా ప్రజలకు సుపరిపాలన అందించింది. గత ఏడాది అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వివిధ శాఖల్లో మండస్థాయి రెగ్యులర్ అధికారులను నియమించకపోవడంతో ఇన్‌చార్జ్ పాలన అస్తవ్యస్తంగా మారింది. పాత నియోజకవర్గమైన కోవెలకుంట్లలోని పలు కీలక శాఖల్లో ఇన్‌చార్జ్ అధికారులే దిక్కయ్యారు. రెగ్యులర్ అధికారులు లేక ఇన్‌చార్జ్ అధికారులకు బాధ్యతలు అప్పగించడంతో వివిధ కార్యాలయాల్లో సకాలంలో సేవలందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- కోవెలకుంట్ల మండలానికి రెగ్యులర్ తహసీల్దార్ లేకపోవడంతో డిప్యూటీ తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డికి ఫుల్ అడిషనల్ చార్జ్ బాధ్యతలు అప్పగించారు.
- కోవెలకుంట్ల పంచాయతీకి రెగ్యులర్ ఎగ్జిక్యూటివ్ అధికారి లేకపోవడంతో డిప్యూటీ ఎంపీడీఓ ప్రకాష్‌నాయుడు అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.
- నంద్యాల రైతు శిక్షణా కేంద్రంలో ఏడీఏగా పని చేస్తున్న సుధాకర్‌కు కోవెలకుంట్ల వ్యవసాయ శాఖ ఉప సంచాలకులుగా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఇటీవల జరిగిన ఏడీఏ బదిలీల్లో ఆయననే రెగ్యులర్ ఏడీఏగా నియమించినా బాధ్యతలు చేపట్టలేదు.
- వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ రెగ్యులర్ పోస్టును భర్తీ చేయకపోవడంతో సంజామల ఏపీఎం గురుస్వామి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.
- ఆర్టీసీ డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న తిరుపతయ్య గత నెలలో పదవీ విరమణ పొందటంతో ఆ స్థానంలో ఆళ్లగడ్డ డీఎం ఎం. వెంకటేశ్వరరావునుకు అదనపు బాధ్యతలు అప్పగించారు.
- కోవెలకుంట్ల ఉర్దూ ఉన్నత పాఠశాలలో 75 మందిలోపే విద్యార్థులు ఉండటంతో హెచ్‌ఎం పోస్టు రద్దు కాగా ఆ స్థానంలో పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడికి అదనపు బాధ్యతలిచ్చారు.
- బనగానపల్లె కళాశాల హాస్టల్ వార్డన్ చైతన్యలక్ష్మి కోవెలకుంట్ల బీసీ బాలుర వసతిగృహ ఇన్‌చార్జ్ వార్డన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.
- దొర్నిపాడు హాస్టల్ వార్డన్ ఎర్రమ్మ కోవెలకుంట్ల మండలంలోని గుళ్లదూర్తి బీసీ బాలుర వసతి గృహ ఇన్‌చార్జ్ వార్డన్‌గా కొనసాగుతున్నారు.
- పట్టణ శివారులోని గురుకుల పాఠశాలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్ లేకపోవడంతో కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకురాలు ఉమాదేవికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

నిర్మాణ పనులు పూర్తయ్యేనా?

- రూ.50 లక్షలతో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్



నిర్మాణం మధ్యలో ఆగిపోయిన భవనం

కొలిమిగుండ్ల: స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవన నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ప్రజలు పట్టణాలకు పోవాల్సిన అవసరం లేకుండా స్థానికంగా వివిధ రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసేందుకు రూ.50 లక్షలతో బ్లాక్ హెల్త్ యూనిట్‌ను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేయించింది. భవన నిర్మాణ పనులు 75 శాతం పూర్తయ్యాయి. ఫ్లోరింగ్, విద్యుత్, పెయింటింగ్ తదితర చిన్నచిన్న పనులు మాత్రమే పూర్తి చేయాల్సి ఉంది. ఈ భవనం పూర్తయితే 30 రకాల పరీక్షలు ఇక్కడ ప్రజలకు అందుబాటులోకి వస్తాయి. సిబ్బంది నియామకం జరుగుతుంది. ప్రస్తుతం రోగులు ఏవైనా పరీక్షలు చేయించుకోవాలంటే తాడిపత్రి, జమ్మలమడుగు, నంద్యాల తదితర పట్టణాలకు వెళ్లాల్సి వస్తోంది. పైగా వ్యాధి నిర్ధారణ పరీక్షలకు వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి రావడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో నాపరాతి గనులు అధికంగా ఉండటంతో కార్మికులు వివిధ రకాల వ్యాధుల బారిన పడుతుంటారు. ఆ ఉద్దేశంతోనే గత ప్రభుత్వం ఇక్కడ బ్లాక్ యూనిట్‌ను మంజూరు చేయించింది. అసంపూర్తిగా ఉన్న భవనానికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయించి వాడుకలోకి తీసుకొస్తే మండల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

మున్సిపల్ స్థలంలో అక్రమ నిర్మాణాలు



మున్సిపల్ చైర్మన్ రాజేష్, టౌన్ ప్లానింగ్ అధికారి శబరీష్‌తో తమ గోడు వెళ్లబోసుకుంటున్న బాధితుడు

డోన్ : పట్టణ శివారులోని శ్రీరాంనగర్ సర్వే నంబర్ 377 సి 1 522-1, 372-3, 377-సి3, 522-4లలోని లేఅవుట్‌లో 25 సెంట్లు ప్రజాప్రయోజనాల కోసం 1976లో డోన్ గ్రామ పంచాయతీకి అప్పగించిన స్థలాన్ని కొందరు 1992లో అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. లేఅవుట్ ప్రకారం స్థల యజమాని డాక్టర్ రామసుబ్బయ్య ఎకరాకు 5 సెంట్ల చొప్పున 15 సెంట్లు ఒక చోట, 25 సెంట్లు మరో చోట, 50 సెంట్ల స్థలాన్ని 1976లో వేరొక చోట ప్రజాప్రయోజనాల కోసం అప్పగించారు. అయితే ఇందులో 25 సెంట్ల స్థలాన్ని నేరేడుచెర్ల శేషిరెడ్డి, హుసేన్ ఫొటోస్టూడియో యజమానితో పాటు మరో 12 మందికి 1992లో విక్రయించారు. ఇప్పుడు స్థలం యజమాని వారసులకు, మున్సిపల్ అధికారులకు మధ్య వివాదం నెలకొన్న నేపథ్యంలో ఈ రిజిస్ట్రేషన్ వ్యవహారం బయటకు పొక్కింది. డాక్టర్ రామసుబ్బయ్య తోటలో మున్సిపల్ అధికారులు నాలుగేళ్ల క్రితం పార్కు, స్విమ్మింగ్ ఫూల్, రోడ్లు నిర్మించారు. అయితే తాము గ్రామ పంచాయతీకి 50 సెంట్లు మాత్రమే ప్రజాప్రయోజనాల కోసం అప్పగించామని, అదనంగా 33 సెంట్లు మున్సిపాలిటీ అధికారులు ఆక్రమించారని యజమానులు కోర్టుకు వెళ్లారు. దీంతో మున్సిపల్ అధికారులు తీగ లాగితే డొంక కదిలినట్లు ఆయా సర్వే నంబర్లలోని 25 సెంట్ల స్థలాన్ని సదరు యజమానులు 1976లో గ్రామ పంచాయతీకి అప్పగించి తిరిగి 1992లో ప్రైవేటు వ్యక్తులకు విక్రయించారని తేటతెల్లమైంది.

ఇళ్లు నిర్మించిన వారికి నోటీసులు..

ఆయా సర్వే నంబర్లలో 25 సెంట్ల స్థలంలో అక్రమంగా ఇళ్లు నిర్మించారని మున్సిపల్ అధికారులు సదరు 12 మందికి నోటీసులు జారీచేశారు. ప్రజాప్రయోజనాలకు కేటాయించిన స్థలంలో అక్రమంగా ఇళ్లు నిర్మించడం చట్టవిరుద్ధమని, వీటిని ఎందుకు కూల్చివేయకూడదో పదిరోజుల్లో సమాధానం చెప్పాలని నోటీసులో పేర్కొన్నారు. కాగా.. అక్రమ నిర్మాణాలని పేర్కొంటూ కూల్చివేస్తామంటున్న అధికారులు 1993లో ప్రజాప్రయోజనాల కోసం కేటాయించిన స్థలంలో ఇళ్లు నిర్మించుకునేందుకు ఎలా అనుమతులు ఇచ్చారని బాధితులు నిలదీస్తున్నారు. తమ సమస్యకు పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.

ప్రజాస్వామ్యం అంటే కాంగ్రెస్‌కు చిన్న చూపు



మాట్లాడుతున్న రమణ

డోన్ టౌన్ : ప్రజాస్వామ్యం అంటే కాంగ్రెస్‌కు చిన్నచూపు అని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ సందు వెంకటరమణ అన్నారు. ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బుధవారం శ్రీసరస్వతి శిశుమందిర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇందిరాగాంధీ సమయంలో జూన్ 25 1975 నుంచి మార్చి 21 1977 వరకు ఎమర్జెన్సీ విధించడంతో దేశం మరో మారు స్వాతంత్రం కోల్పోయిందని విమర్శించారు. ఎమర్జెన్సీ సమయంలో లక్షా నలభై వేల మంది జాతీయవాదుల్ని , ప్రజలను నిర్బంధించి నియంతృత్వ పాలన సాగించారని ఆరోపించారు. నాటి మైండ్ సెట్‌తోనే ఇప్పటి కాంగ్రెస్ నాయకులు ఉన్నారన్నారు. ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు బద్రీ సుధాకర్,సీనియర్ నాయకుడు బొగ్గరపు నటరాజ్, జిల్లా ఉపాధ్యక్షులు కిరణ్,సురేష్,విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ట్రిపుల్ ఐటీకి నలుగురు విద్యార్థుల ఎంపిక



ఉసేన్‌బాషా



కరీష్మా



జహరూన్



ప్రణవీ

కోవెలకుంట్ల: 2024-25 పదవ తరగతి ఫలితాల్లో కోవెలకుంట్లకు చెందిన నలుగురు విద్యార్థులు సత్తా చాటి ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్‌ఎంలు రాజయ్య, అరుణకుమారి తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఉసేన్‌బాషా, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన కరీష్మా, జహరూన్, అందనం ప్రణవీ వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు తెలిపారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

కోవెలకుంట్ల: భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ సూచించారు. సంవిధాన్ హత్యా దివస్(1975 జూన్ 25న విధించిన ఎమర్జెన్సీ డే) సందర్భంగా రాజ్యాంగ ప్రాముఖ్యతపై బుధవారం కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రాజ్యాంగంలో సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం వంటి విలువలు నిక్షిప్తమై ఉన్నాయని, ప్రాథమిక దశలోనే వాటిని అర్థం చేసుకుని సామాజిక న్యాయం, ధర్మనిరపేక్షిత వంటి అంశాలవైపు నిలవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, సంటిరెడ్డి, నరేంద్రనాథరెడ్డి, సుభాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహించాలి



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహించి వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు కృషి చేయాలని ప్రకృతి వ్యవసాయ సాగు సంస్థ జిల్లా కోఆర్డినేటర్లు రామకృష్ణ, నరేంద్ర తెలిపారు. పట్టణంలోని జాడీల ఫ్యాక్టరీ ఆవరణలో ఉన్న బుగ్గన బిపి శేషారెడ్డి రావుబహద్దూర్ శిక్షణ కేంద్రంలో గ్రామ కోర్డినేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రకృతి సాగును ప్రోత్సహించే విధంగా అన్నదాతలను సిద్ధం చేయాలని చెప్పారు. అలాగే ఇప్పటికే సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయం సాగు చేస్తున్న రైతన్నల జాబితాలను సిద్ధం చేసి వారికి అన్ని విధాలుగా సూచనలు,సలహాలు ఇవ్వాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్ రంగారెడ్డి,మోడల్ మేకర్ రామమద్దయ్య ఉన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



పీహెచ్‌సీ ఎదుట స్పీడ్ బ్రేకర్లు లేని దృశ్యం

బనగానపల్లె రూరల్: మండలంలోని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఎదుట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు, వైద్య సిబ్బంది కోరుతున్నారు. గ్రామంలో గతంలో శిథిలావస్థలో చిన్న గదుల్లో వైద్యశాల ఉండేది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న కాటసాని రామిరెడ్డి వైద్యశాలకు సుమారు రూ.1.50 కోట్లు నిధులు మంజూరు చేయించి, ఆధునిక వసతులతో వైద్యశాలను నిర్మించి ప్రారంభించారు. వైద్యశాల ఎదురుగా బనగానపల్లె - నంద్యాల ప్రధాన రోడ్డు కావడంతో నిత్యం రద్దీగా ఉంటోంది. వాహనాలు కూడా వేగంగా రాకపోకలు సాగిస్తుండటంతో ఆసుపత్రికి వచ్చే రోగులు, వృద్ధులు రోడ్డు దాటడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు జరగకముందే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి వాహనాల వేగాన్ని నియంత్రించాలని వైద్య సిబ్బంది, గ్రామస్తులు కోరుతున్నారు.

అక్రమ బంకుల ఏర్పాటును అడ్డుకోండి



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : పట్టణంలోని ఫ్లెవైర్ బ్రిడ్జి కింద అర్ధరాత్రి పూట అక్రమంగా స్థలాలను ఆక్రమించి బంకులు ఏర్పాటు చేస్తుండటంతో చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాటిని నియంత్రించాలని ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష,కార్యదర్శులు అన్వర్,అబ్బాస్ డిమాండ్ చేశారు. అక్రమ బంకులు తొలగించాలని కోరుతూ బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద చిరు వ్యాపారులతో కలిసి ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ పగటి పూట తోపుడు బండ్లలో వ్యాపారం చేసుకొని రాత్రి వేళల్లో బండ్లను ఇంటి వద్ద ఉంచుకుంటున్నామని ఈ సమయంలో బంకులు ఏర్పాటు చేస్తే మరుసటి రోజు ఉదయం బండి రోడ్డుపై పెట్టుకోవల్సి వస్తోందని, దీంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా తోపుడు బండ్లు, గంపలతో వ్యాపారాలు చేసుకుంటున్నామని, అక్రమంగా ఏర్పాటు చేసే బంకులను నిరోధించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కమిషనర్ ప్రసాద్‌గౌడ్, పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషాకు వినతి పత్రం అందజేశారు. నాయకులు రవి,రాజు,శ్రీను,తాయేస్,అశోక్, మౌలాలి ఉన్నారు.

గూటుపల్లె చెరువును రిజర్వాయర్‌గా మార్చాలి

బేతంచెర్ల: మండలంలోని రైతులను దృష్టిలో ఉంచుకొని గూటుపల్లె చెరువును రిజర్వాయర్‌గా మార్చాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని గూటుపల్లె చెరువును రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, మండల కార్యదర్శి రామ్మోమోహన్, సర్పంచ్ శ్రీరాములు.. రైతులతో కలిసి పరిశీలించారు. రిజర్వాయర్‌గా మార్చితే బోరుబావుల్లో భూగర్భ జలాలు పెరిగి రైతులకు సౌకర్యంగా ఉంటుందని చెప్పారు.

ఉపాధి ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

కొలిమిగుండ్ల: ఇటీవల పని వేళల్లో విందులో పాల్గొన్న ఉపాధి హామీ పథకం ఉద్యోగులకు బుధవారం డ్వామా పీడీ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కల్వటాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ మాబు విందు ఏర్పాటు చేయడంతో ఈసీ చిన్నరంగయ్య, టీఏలు ఓబులేసు, రంగన్న, మునిరాజ్, కంప్యూటర్ ఆపరేటర్లు సుబ్బరాయుడు, పెద్దయ్య, నరేష్‌తోపాటు బెలుం శింగవరానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు. విందులో మద్యం తాగి ఉపాధి హామీ పనుల్లో జరిగిన అక్రమాల గురించి చర్చించారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్ కావడంతో ఏపీడీ సాంబశివరావు విచారణ చేసి నివేదికలను పీడీకి అందజేశారు. పరిశీలించిన ఆయన ఏడుగురు ఉద్యోగులు, కల్వటాల, బెలుం శింగవరం ఫీల్డ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు పంపారు. మూడు రోజుల్లో పీడీ ఎదుట హాజరై వివరణ ఇచ్చుకోవాల్సి ఉంది.

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ



గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు

డోన్: పట్టణ శివారులోని కొండపై వెలిసిన తిరుమల వీరాంజనేయ స్వామి సన్నిధిలో బుధవారం అమావాస్య పూజలకు భక్తులు అధిక సంఖ్యల్లో పాల్గొన్నారు. వేకువ జాము నుంచే స్వామి వారికి అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. సాయంకాలం ఆలయం చుట్టూ స్వామి వారిని పల్లకీపై ఊరేగిస్తూ గిరి ప్రదక్షిణ చేశారు. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు హనుమాన్ చాలీసా 11 సార్లు పఠించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

రోడ్డుపైనే గుంత.. జర జాగ్రత్త!



సంజామల మండల పరిధిలోని ముదిగేడు సచివాలయం ఎదుట రోడ్డుపై గుంత ఉండడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. దాదాపు నెల రోజుల నుంచి రోడ్డుపై గుంత ఏర్పడినా అధికారులు పట్టించుకోవడం లేదు. కోవెలకుంట్ల-అవుకు ప్రధాన రహదారి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించి ప్రమాదాలు నివారించాలని వాహనదారులు కోరుతున్నారు. – సంజామల

శిక్షణకు స్పందన కరువు



శిక్షణకు అరకొరగా హాజరైన మహిళా సర్పంచులు

డోన్ టౌన్ : రెండు రోజులుగా పట్టణంలోని జాడీల ఫ్యాక్టరీ ఆవరణలో మహిళా సర్పంచులకు ఇస్తున్న శిక్షణ శిబిరానికి స్పందన కరువైంది. నియోజకవర్గంలోని మూడు మండలాలకు చెందిన మహిళా సర్పంచ్‌లకు గ్రామ పంచాయతీ అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర, చేపట్టవల్సిన అంశాలపై మండల పరిషత్ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు. మూడు మండలాలకు సంబంధించి 46 మంది మహిళా సర్పంచ్‌లు ఉండగా మొదటి రోజు మంగళవారం కేవలం 18 మంది, రెండో రోజు బుధవారం 15 మంది హాజరయ్యారు. దీంతో అధికారులు వచ్చిన సర్పంచ్‌లకు శిక్షణ ఇచ్చిమమా అనిస్తున్నారు. అయితే హాజరైన మహిళా సర్పంచ్‌లకు తోడుగా వచ్చిన వారికి కూడా భోజన వసతి ఏర్పాటు చేయడానికి మండల పరిషత్ కార్యాలయ సిబ్బందికి భారంగా మారింది.

బ్యాంక్‌కు వెళ్లొచ్చేలోపు ఇంట్లో చోరీ

మహానంది: ఉపాధి కూలీ వేతనాలు ఖాతలో జమ అయ్యాయో లేదో చూసుకుందామని బ్యాంకుకు వెళ్లొచ్చే లోపే బుధవారం తమ్మడపల్లె గ్రామంలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడు కాసుల పెద్ద వెంకటరమణ దంపతులు తెలిపిన వివరాలు.. పెద్ద వెంకటరమణ దంపతులు ఉపాధి కూలీ పనులతో పాటు వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఉపాధి కూలీ డబ్బులు ఖాతాలో వేశారేమోనని బుక్కాపురం బ్యాంకుకు వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి చూడగా దుస్తులను చెల్లాచెదురు చేసి, రూ.16 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితులు వాపోయారు. ఈ విషయంపై మహానంది పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

అడవి పందులతో పైర్లకు నష్టం

మహానంది: అడవి పందులతో పైర్లకు నష్టం కలుగుతోందని బసవాపురం గ్రామానికి చెందిన రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు సుబ్బరాయుడు, మద్దిలేటి తదితరులు సుమారు మూడున్నర ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. మంగళవారం రాత్రి అడవి పందులు పొలాల్లోకి ప్రవేశించి నాశనం చేశాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అడవి పందుల బారి నుంచి పైర్లను కాపాడేందుకు అటవీశాఖ అధికారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



ప్రొక్లెయిన్‌తో వంకను పూడ్చేస్తున్న దృశ్యం

వంక మాయం!

డోన్: పట్టణంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి కూరగాయల మార్కెట్ వెనుక ప్రాంతంలోని వంక కబ్జారాయుళ్ల కారణంగా రోజు రోజుకు కుచించుకుపోతోంది. ఒకప్పుడు 33 మీటర్ల వెడల్పు ఉన్న ఈ వంక ప్రస్తుతం చిన్న డ్రైనేజీలా మారిందంటే ఎంతలా ఆక్రమణకు గురైందో అర్థం చేసుకోవచ్చు. మైనర్ ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం మూలంగా కొచ్చెర్వు చెరువు నుంచి వెంకటాపురం చెరువుకు నీటి పరివాహక ప్రాంతం నానాటికి కనుమరుగై మైదాన ప్రాంతంగా మారే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా పెద్దవంకను పరిరక్షించాలని కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



తొట్టిలో నిల్వచేసిన నీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది

డోన్ : నీటి కలుషితం ద్వారా అంటురోగాలు ప్రబలే ప్రమాదం ఉందని, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా పర్యవేక్షణ అధికారి మధు అన్నారు. కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మలేరియా, డెంగీ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బుధవారం ఇందిరానగర్‌లో ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా పాత తొట్లు, ఓవర్ హెడ్ ట్యాంకులపై మూతలు ఉండేట్లు చూసుకోవాలని వైద్యసిబ్బంది స్థానికులకు సూచించారు. పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. సాయంకాలం పూట వేపాకుతో పొగ వేసుకొని దోమల నుంచి రక్షణ పొందాలన్నారు. ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.